www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

ఆది వారం
22-1-2023

సంపుటి - 07, సంచిక-238
పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## రెండు రోజులపాటు గోల్కొండ కోట సందర్శన రద్దు

జీ20 సమావేశాల నేపథ్యంలో నిర్ణయం



**హైదరాబాద్, జనవరి 21 (సమ సమాజం):** గోల్కొండ కోటను చూసేందుకు వస్తున్న పర్యాటకులకు బిగ్ న్యూస్ ఇది. జనవరి 28, 29 తేదీల్లో పర్యాటకులకు గోల్కొండ కోట చూసేందుకు అనుమతి లేదు. హైదరాబాద్ పర్యటనకు 3వ

## ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన ఖరారు

**వచ్చే నెల 13న హైదరాబాద్‌కు రానున్నట్లు వెల్లడి**

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన**

**అదేరోజు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ**

న్యూఢిల్లీ,జనవరి21(సమసమాజం): ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు షెడ్యూల్ ఖారారు అయింది. ఫిబ్రవరి 13న హైదరాబాద్‌కు మోదీ రానున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. వాస్తవానికి సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ట్రయిన్ ను ప్రారంభించడానికి ఈ నెల 19నే మోడీ తెలంగాణలో పర్యటించాల్సింది. కానీ అనివార్య కారణాలవల్ల పర్యటన రద్దు అయ్యింది. దీంతో అనుకున్న టైం కంటే ముందే



3వ

## కాలిపోయిన భవనంలో అస్థిపంజరాలు లభ్యం

హైదరాబాద్,జనవరి21(సమసమాజం): సికింద్రాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు వ్యక్తులు గల్లంతయిన విషయం తెలిసిందే. ఐతే ప్రమాదం నుంచి తప్పించుకునే అవకాశం లేనందున.. వారు సజీవ దహనమైనట్లు అధికారులు వెల్లడించారు. మృతదేహాలు కూడా కాలిబూడిదై ఉంటాయి. ఎముకలు, దంతాలు మాత్రమే మిగిలి ఉండే అవకాశముందని చెప్పారు. ఈ క్రమంలోనే వారి మృతదేహాల అవశేషాల కోసం గాలిస్తున్నారు. భవనం పూర్తిగా దెబ్బతినడంతో.. ఏ క్షణమైనా కూలే అవకాశమున్నందున.. ఎవరూ లోపలికి వెళ్లే పరిస్థితులు లేవు. ఐతే



3వ

# డీఎస్సీ కార్యాలయం ముందు ఉపాధ్యాయుల మౌన దీక్ష

## ఉపాధ్యాయ దంపతుల ఆందోళన ఉద్రిక్తం




హైదరాబాద్,జనవరి21(సమసమాజం): భార్య భర్తలు ఒకో చోట పనిచేసేలా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ దంపతులు చేపట్టిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి రణరంగంగా మారింది. లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మౌన దీక్షకు ఉపాధ్యాయ స్పౌస్ ఫోరమ్ పిలుపునిచ్చింది. దీంతో కమిషనర్ కార్యాలయం వద్దకు చేరుకుంటున్న ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కసారిగా ఆర్టీసీ బస్సులలో వచ్చిన ఉపాధ్యాయ దంపతులు.. పిల్లలతో సహా కమిషనర్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఉపాధ్యాయ 3వ

# బడ్జెట్ పై కసరత్తు

## రాష్ట్ర బడ్జెట్ రూ.3లక్షల కోట్లు

- బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట
- రూ.37,000కోట్లు కేటాయించే అవకాశం
- కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లతో బడ్జెట్ లో రూపకల్పన
- రాష్ట్రబడ్జెట్ ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ సమీక్ష
- మంత్రి హరీశ్‌రావు, సంబంధిత అధికారులతో చర్చ



హైదరాబాద్,జనవరి21(సమసమాజం): రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ ఆర్థిక 3వ

## ఎస్ఎస్‌సీలో రిక్రూట్‌మెంట్

పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ జారీ

11,409 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

న్యూఢిల్లీ,జనవరి21(సమసమాజం): కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన సంస్థల్లో క్లరికల్ పోస్టులను భర్తీ చేయడానికి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ టా రిక్రూట్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తుంటుంది. తాజాగా మల్టీ-టాస్కింగ్ (నాన్-టెక్నికల్) స్టాఫ్, హవల్దార్ పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ జారీ 3వ

## కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- అందరం కలిసి పని చేయకపోవడం వల్ల ఎన్నికల్లో ఓడిపోయాం
- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వల్ల పార్టీకి నష్టం
- కోమటిరెడ్డిపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,జనవరి21(సమసమాజం): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పై అదే పార్టీకి చెందిన కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందరం కలిసి పని చేయకపోవడం వల్ల ఎన్నికల్లో ఓడిపోయాం. ఇప్పటికైనా కలిసికట్టుగా పని చేయాలి. అలాగే పార్టీకి నష్టం చేకూర్చిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ 3వ

# రెండు నెలల పాటు హాథ్‌సే హాథ్ జోడో యాత్ర

## గడపగడపకూ తీసుకువేళ్లెందుకు పార్టీ ప్రణాళికలు



- ఫిబ్రవరి 6 నుంచి రేవంత్‌రెడ్డి పాదయాత్ర
- 50 నియోజకవర్గాలకు తగ్గకుండా యాత్ర
- నేతలంతా ఐక్యంగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేయండి
- నేను ఎవరికీ అనుకూలం కాదు.. వ్యతిరేకం కాదు
- అనవసర ఆలోచనలు పక్కనపెట్టండి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే

హైదరాబాద్,జనవరి21(సమసమాజం): నేను ఎవరికీ అనుకూలం కాదు.. వ్యతిరేకం కాదు. అలాంటి ఆలోచన ఉంటే పక్కనపెట్టండి. అధిష్ఠానం చెప్పింది చేయడమే నా విధి" అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత్ జోడో యాత్ర మాదిరిగానే తెలంగాణలో రెండు నెలల పాటు చేపట్టనున్న హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమాన్ని గడపగడపకూ తీసుకువెళ్లాలని సూచించారు."ఎముకలు కొరికే చలిలో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర చేశారు. యాత్ర లక్ష్యాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. నేతలంతా 3వ

# కేసీఆర్ కళ్లకి అద్దాలు పెట్టించాలి

**మోడీ అభివృద్ధిని కేసీఆర్ కు చూపించాలి**

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**



హైదరాబాద్,జనవరి21(సమసమాజం): నగరం లోపల, వెలుపల పెద్ద ఎత్తున అక్రమ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బిల్డింగ్ రెగ్యులరేషన్ స్కీంపై హైకోర్టు మొట్టికాయలు వేసినా పురపాలక శాఖ మంత్రికి పట్టదని ఆయన విమర్శించారు. పురపాలక శాఖ మొత్తం అవినీతి మయమైందని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కేటీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ ఒక అసమర్థ మంత్రి అంటూ మండిపడ్డారు. ప్రతి కంపెనీ పెట్టుబడిలో కేటీఆర్ వాటా ఉందన్న ఆయన.. పారిశ్రామిక వాడల మీద కేటీఆర్ కన్ను వేశారని ఆస్తులను కాజేస్తున్నారని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ అప్లికేషన్ మీద సంతకం పెట్టేందుకు, ఢిల్లీలో భవన శంకుస్థాపనకు, ఖమ్మం సభకు కేటీఆర్ రాలేదని ఆయన చెప్పారు. దీనిని బట్టి చూస్తే హరీశ్‌రావును ఢిల్లీకి వెళ్లగొట్టి.. రాష్ట్రాన్ని కేటీఆర్ హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ మంత్రి వర్గంలో అతిపెద్ద అవినీతి మంత్రి కేటీఆర్ అంటూ ధ్వజమెత్తారు. కామారెడ్డి, జగిత్యాల మాస్టర్ ప్లాన్ కూడా కేటీఆర్ దుర్బుద్ధే అంటూ విమర్శించారు. కంటి వెలుగులో తొలి కంటి ఆపరేషన్ కేసీఆర్‌కు చేయించాలన్నారు. కేసీఆర్ కళ్లకి అద్దాలు పెట్టించి.. మోడీ అభివృద్ధిని చూపించాలన్నారు. దేశంలోనే ఏకైక దళిత వ్యతిరేక ముఖ్యమంత్రి 3వ

## సంపాదకీయం

# చమురు,గ్యాస్ ధరలపై బడ్జెట్‌లో చర్చించాలి !

చమురు, గ్యాస్ ధరలపై కేంద్రం మొండిగా వ్యవహరించడంతో సామాన్యులకు దాని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ముఖ్యంగా పేద,మధ్య తరగతి ప్రజలకు పెట్రో ధరలతో పాటు గ్యాస్ ధరలు మోయలేని భారంగా మారాయి. గ్యాస్ సిలిండర్ 1100 రూపాయలు దాటింది. ఈ ఎనిమిదేళ్లలో 400 నుంచి 1135కు పెరిగింది. అయినా దీనిని సమీక్షించడంలో కేంద్రం ముందుకు రావడం లేదు. అలాగే పెట్రో ధరలు కూడా సామాన్యులకు, చిరు వ్యాపారులకు తలకుమించిన భారంగా మారాయి. కరోనా దెబ్బతో ఆర్థికంగా దెబ్బ తిన్నప్పటికీ సామాన్యులు కూడా తమ రక్షనకు సొంత వాహనాలు సమకూర్చుకున్నారు. ఇప్పుడు వీరంతా ఇఎంఐలతో పాటు పెట్రో దెబ్బలతో అల్లాడుతున్నారు. అలాగే బ్యాంక్ వడ్డీలు పెరగడంతో సామాన్యులకు, ఉద్యోగులకు గృహరుణాలు భారంగా మారాయి. బడ్జెట్ సమావేశలు జరుగబోతున్న వేళ ఈ అంశాలతో పాటు, సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించాలి. ప్రధానంగా పెట్రో,గ్యాస్ ధరలు తగ్గితే మిగతా నిత్యావసరలు, రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దేశంలో ప్రజలు కోరుకుంటున్న విధంగా బడ్జెట్ రూపకల్పన జరగాలి. ప్రధానంగా పెట్రో ధరలపై బడ్జెట్‌లో చర్చచేయాలి. నిజానికి అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినా ప్రభుత్వం మాత్రం పెట్రో ధరలు తగ్గించలేదు. ఇకపోతే ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా నుంచి చమురు దిగుమతులు పెరిగాయి. తక్కువ ధరలకే చమురు కొనుగోలు చేస్తున్నాం.

ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా తమ ఇంధన భద్రతను తాము చూసుకోవాలని అందుకోసమే రష్యా నుంచి దిగుమతి చేసుకుంటామని కేంద్ర ప్రభుత్వ ఇప్పటికే ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం క్రియాశీలత, వేగాన్ని ప్రదర్శించి ఇంధన ధరలు అదుపు తప్పకుండా ఉండేందుకే కొనుగోలు చేప్టింది. ఓ రకంగా ఇది మోడీ ముందుచూపుకు నిదర్శనంగా చెప్పుకోవాలన్న ప్రచారం కూడా సాగింది. రష్యా నుంచి దిగుమతులు పెరగకపోతే పెట్రోల్ లీటరు పెట్రోలు రూ. 150 నుంచి 175కు పెరిగేదని నిపుణులు చెప్పడం వెనకా మతలబు దాగిఉంది. ఇదికూడా నిజమే కావచ్చు. కేంద్ర ప్రభుత్వం తెలివైన నిర్ణయం తీసుకుందని ఆర్థికవేత్తలు కూడా అంగీకరించేలా చేశారు. ప్రధాని రాజనీతిజ్ఞత కారణంగానే రష్యా నుంచి కొనుగోళ్లు పెంచినట్లు చెప్పారు. తమ ఆంక్షలను ధిక్కరించినా భారత్ మీద ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకో కూడదని పశ్చిమ దేశాలు నిర్ణయించాయి. దాంతో మన అవసరం వారికి ఉంది కనుకనే అమెరికా దిగి వచ్చిందని కూడా అంటారు. దశాబ్దాలుగా సోవియట్ యూనియన్‌తో తరువాత రష్యాతో మన స్నేహ సంబధాలు కొనసాగాయి. రష్యా మనకు మిత్ర దేశంగా ఉంది కనుక చమరు దిగుమతుల్లో లాభం జరిగిం దన్న ప్రచారం సాగింది.అయితే రికార్డు స్థాయిలో తక్కువ ధరకు ఇంధనం కొనుగోలు చేసిన రష్యా చమురు తో వినియోగదారులకు ఒరిగిందేమిటన్నదే ఇక్కడ ప్రశ్న. ఈ చమరుతో సామాన్యులకు మేలు జరిగివుంటే బాగుండేది. కానీ తక్కువ ధరలకు కొన్న చమురుతో ప్రభుత్వం ప్రజలపై భారం మోపి వ్యాపారం చేస్తోంది. గతేడాది ఏప్రిల్ తరువాత ధరలను తగ్గించిన దాఖలాలు లేవు. దానిని అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రిలయన్స్, నయారా సంస్థలు ఎక్కడా ఒక్క లీటరు పెట్రోలు, డీజిల్ కూడా తక్కువ ధరలకు అమ్మిన జాడలేదు. దీంతో రష్యా ఇచ్చిన రిబేటు ఎవరి జేబుకు వెళ్లినట్లన్న చర్చ కూడా సాగు తోంది. నిజానికి రష్యా చమురును అమెరికా, ఇతర దేశాలకు అమ్మేందుకే అని, అంబానీకి లాభాలు కట్టబెట్టేందుకే అని ఇప్పుడు మెల్లగగా అసలు విషయాలు బయటకు వస్తున్నాయి. ఆ చమురును ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న అంబానీ, ఇతర ప్రైవేటు చమురు శుద్ధి కర్మాగారాలు దాన్నుంచి ఉత్పత్తి చేసిన వివిధ ఉత్పత్తులను అమెరికా, బ్రిటన్‌కు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంతకాలం

దేశీయంగానే ఆదానీ, అంబానీలకు సాయం అందిస్తున్న మోడీ ప్రభుత్వం ఇలా అంతర్జాతీయం గా కూడా సాయం చేస్తున్నదన్న విమర్శలకు బలం చేకూరింది. శ్రీలంకలో సోలార్ పవర్ కాంట్రాక్ట్ ఆదానీకి దక్కేలా మోడీ పైరవీలు చేసినట్లుగా కూడా ఆరోపణలు వచ్చాయి. ఇదే క్రమంలో గతేడాది రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురు 33 రెట్లు పెరిగింది. మన దిగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న ఇరాక్‌ను వెనక్కు నెట్టి రష్యా ముందుకు వచ్చింది. అంతే ఇదంతా కూడా అంబానీ ఖాతాల్లోకి వెళుతుందన్న విషయం అర్థం అవుతోంది. అందుకే దేశంలో పెట్రోధరలు తగ్గడం లేదన్న విషయం మెల్లగా అర్థంఅవుతోంది. ఈ విషయం లో సచ్చీలతను రుజువు చేసుకోవాల్సిన బాధ్యత బిజెపిపై ఉంది. నిజానికి అంతర్జాతీయంగా మనం కొంటున్న ఇంధన ధరలకు, దేశంలో అమ్ముతున్న ధరలపై చర్చించాలి. ఎంతమేర కేంద్రం ఖాతాలో పడుతుందో తెలియాలి. అలాగే ఎంతమేర ప్రైవేట్ కాంట్రాక్టర్లు కొట్టేస్తున్నారో కూడా తెలియాలి. ఇవన్నీ పార్లమెంట్ వేదికగా సమగ్ర చర్చ జరగాలి. దేశంలో సమస్యలను చర్చించడం అలవాటు చేసుకోలేని మోడీ తాను బ్రహ్మాండంగా దేశాన్ని అభివృద్ధి చేస్తున్నానని ప్రచారం చేసుకుంటున్నారు. పక్కన ఉన్న శ్రీలంకను, పాకిస్థాన్‌ను బూచిగా చూపి మన పాలనే బాగుందని, మనదగ్గరే ధరలు తక్కువగా ఉన్నాయన్న భ్రమలు కల్పిస్తున్నారు. ఆ దేశాలతో పోలిస్తే మన దగ్గర పంటల దిగుబడులు ఎక్కువ. అలాగే అర్థాకలితో చచ్చే పరిస్థితులు లేవు. నిజానికి బడ్జెట్ కేటాయింపులు, ఆదాయవనరులు, ఖర్చులు పద్దులపై సమగ్రంగా చర్చలు సాగడం లేదు. బుల్‌డోజ్ పద్ధతిలో బడ్జెట్ సమావేశాలను ముగిస్తున్నారు. ఈ తరహా పద్ధతి పోవాలి. అప్పుడే సమగ్రచర్చకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వంలో లోపాలు లేకుంటే ఎలాంటి విషయాలనైనా చర్చించాలి. చర్చ అన్నది ప్రజలకు మేలు చేస్తుందని గుర్తించాలి. త్వరలో జరుగనున్న వివిధరాష్ట్రాల ఎన్నికలకు ముందు వస్తున్న బడ్జెట్ కాబట్టి పారదర్శక చర్చకు బిజెపి తనకుతానుగానే ముందుకు రావాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# స్వాతంత్ర్య సమర సేనాని నేతాజీ

## జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జయంతి

భారత విముక్తికి అలుపెరగని పోరాటం ■ బ్రిటీషర్లను గడగడలాడించిన భారత సేనాని



న్యూఢిల్లీ,జనవరి21(సమసమాజం): దేశ స్వతంతర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర ప్రత్యేకమైన చరిత్ర కలిగి ఉంది. ఆయన బ్రిటిషర్లను గడగడలాడించాడు. ఆయన పోరాటంతో ఒక దశలో స్వాతంత్ర్యం అప్పగించి పోవాలన్న నిర్ణయానికి బ్రిటన్ పాలకులు వచ్చారనిచరిత్రకారులు అంటారు. ఎవరు ఏమి అన్నా ఆయన పోరాటం నిరుపమానం. దేశాన్ని దాస్యశృంఖలాలు తెంచేందుకు చేసిన పోరాటం మరువలేనిది. జనవరి 23 నేతాజీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం ఎంతో అవసరం.ఆజాద్ హింద్ ఫౌజ్‌తో ఆయన చేసిన పోరాటం కారణంగా మనకు 1942లోనే స్వాంత్ర్యం సిద్దించేదని, దేశ విభజన కూడా ఉండేది కాదని చరిత్రకారులు చెబుతారు. నాకు రక్తాన్ని ఇవ్వండి ..నేను మీకు స్వాతంత్యాన్ని ఇస్తాను అంటూ స్వాతంత్రం కొసం పోరాడిన అసమాన వీరుడు ఆయన. బ్రిటిష్ వారికి ధీటుగా భారత్‌కు ఆయుధా లతో పోరాడటం తెలుసని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నతుడుగా చరిత్ర కెక్కారు. స్వాతంత్ర పోరాటం అహింసా మార్గంలోనే కాదు వీర మార్గంలోనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన మహావీరుడు.. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన యోధుడు సుభాష్ చంద్రబోస్. రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీజీతో సిద్ధాంతపరంగా విభేదించి ఆ పదవికి రాజీనామా చేశారు. గాంధీజీ ఆచరించిన అహింసావాదం మాత్రమే స్వాతంత్య్ర సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోస్ బలంగా నమ్మారు. ఈ అభిప్రాయంతోనే ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించి దేశానికి స్వాతంత్యం తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. ఇండియా గేట్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని స్థాపించడం నిజంగా దేశానికి గర్వకారణం. దేశ స్వాతంత్ర్యంలో ఎందరో తమ పద్ధతిలో పోరాడారు. కానీ బ్రిటిషర్లను వణుకు పుట్టించిన నేత మాత్రం సుభాష్ చంద్రబోస్ మాత్రమే. ఆయన జయంతిని జనవరి 23న జరుపుకుంటున్నా ..వర్ధంతిపై నేటికీ స్పష్టత లేదు. బోస్ జయంతిని గత ఏడాది నుంచి పరాక్రమ్ దివస్‌గా జరపాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకే కేంద్ర సాంస్కృ తిక శాఖ అధికారిక ప్రకటన జారీ చేసింది. నేతాజీ జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ప్రజలందరు కూడా ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 1879వ సంవత్సరం జనవరి 23వ తేదీ నేటి ఒడిశాలోని కటక్‌లో జానకీ నాథ్, ప్రభావతీ బోస్‌లకు నేతాజీ జన్మించారు. చిన్నతనం నుంచి విద్యలో రాణించిన బోస్.. రామకృష్ణ పరమహసం, స్వామి వివేకానందుడి మార్గంలో పయనించారు. జాతీయ కాంగ్రెస్‌లో చేరి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్నారు. తత్వశాస్త్రంలో డిగ్రీ పూర్తిచేసి, ఇంగ్లండ్‌కు వెళ్లిన సమయంలోనే జలియన్ వాలా బాగ్ ఉదంతం చోటుచేసుకుంది. ఐసీఎస్ శిక్షణ తీసుకున్నా అధికారిగా బాధ్యతలు స్వీకరించక స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్రిటిష్ అధికారి వెల్స్ క్యూన్ భారత్ పర్యటనకు వ్యతిరేకంగా చిత్తరంజన్‌తో కలిసి జరిపిన పోరాటంలో అరెస్టయ్యారు. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా 11 సార్లు జైలుకు వెళ్లిన సుభాష్ చంద్రబోస్.. ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి భరతమాతను రక్షించేందుకు చలో ఢిల్లీ నినాదాన్ని ఇచ్చారు. నేతాజీ ఆధ్వర్యంలో 1944 ఫిబ్రవరి 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధం ఆరంభం కావడంతో ఆంగ్లేయులను దెబ్బ తీయడానికి ఇదే సువర్ణవకాశమని భావించారు. యుద్ధం ప్రారంభం కాగానే కూటమి ఏర్పాటు చేసే ఉద్దేశంతో రష్యా, జర్మనీ, జపాన్‌లో పర్యటించారు. జపాన్ సహాయంతో యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు, ఔత్సాహికులతో 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఏర్పాటు చేశారు. జపాన్ అందించిన సైనిక, ఆర్థిక, దౌత్య సహకారాలతో ఆజాద్ హింద్ ప్రభుత్వంను సింగపూర్ లో ఏర్పరచారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నేతాజీ జరిపిన పోరాటం వారికి ముచ్చెమటలు పట్టించింది. అహింస మార్గంలో మాత్రమే స్వాతంత్ర లభించదని ఆయుధాలను చేతపడితేనే సాధించ గలమనే నినాదాన్ని నేతాజీ లేవనెత్తారు. స్వాతంత్రం కోసం తన 23వ ఏటనే భారత జాతీయ కాంగ్రెస్‌లో సభ్యుడిగా చేరిన నేతాజీ.. బ్రిటిషర్ల ఆధిపత్యాన్ని అణచివేయడానికి 20 సంవత్సరాలు పోరాడారు. తన 41వ ఏటనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. అహింసామార్గం ఆంగ్లేయులకు అర్థంకాని భాషని తెలుసుకున్న బోస్ 1941లో గృహనిర్బంధంలో ఉన్నప్పుడు బ్రిటిష్ సైన్యం కళ్లల్లో దుమ్ముకొట్టి కలకత్తా నుంచి అదృశ్యమయ్యారు. సాయుధ పోరాటాన్ని బలంగా నమ్మిన బోస్.. జనరల్ మోహన్ సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన సింగపూర్, మలేషియాల్లోని భారత జాతీయ సైనికదళానికి జీవం పోశారు. 1944 ఫిబ్రవరి 4న బర్మా రాజధాని రంగూన్ నుంచి భారత్ సరిహద్దులకు భారత్ సైన్యం ప్రయాణమైంది. తర్వాత రెండేళ్లలో కోహిమా కోట, తిమ్మాపూర్–కొహిమాను సైనిక దళం చేరుకుంది. భారత్ జాతీయ సైనిక దళ దాడుల దాటికి తట్టుకోలేక బ్రిటిష్ సైన్యం కుదేలయింది. అయితే నేతాజీ మరణం వెనుక ఉన్న మిస్టరీ ఇంకా వీడలేదు. 1945, ఆగస్టు 22న నేతాజీ ప్రయాణించిన యుద్ధ విమానం ప్రమాదానికి గురై ఆయన వీరమరణం పొందినట్లు జపాన్ రేడియో ప్రకటించింది. అయితే ఈ ప్రకటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం నేతాజీకి సంబంధి వంద సీక్రెట్ ఫైళ్లను విడుదల చేసినప్పటికీ ఆయన మరణం వెనుక కారణాలు ఇప్పటికీ ప్రపంచానికి ఓ మిస్టరీలానే మిగిలిపోయింది.

# అందరికీ ప్రభుత్వ పథకాలు

## అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ

## మంత్రి వేముల ప్రశాంతరెడ్డి



నిజామాబాద్,జనవరి21(సమసమాజం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులకు అందేలా చూడాలని, అప్పుడే సీఎం కేసీఆర్ కలలు నెరవేర్చిన వారమవుతామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తాజాగా కంటివెలుగు కోసం ప్రజలకు వెలుగుచూపాలని అన్నారు. బిజెపికి తెలంగాణలో సీన్ లేదని, అన్ని ఎన్నికల్లో కూడా గులాబీ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎప్పుడు జరగని అభివృద్ధి ఈ ఎనిమిదేండ్లలో చేసి చూపించిన ఘనత సిఎం కెసిఆర్‌దని అన్నారు. మరో 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో సీఎంగా కేసీఆరే కొనసాగుతారని తెలిపారు. అలాగే కేంద్రంలోనూ సత్తా చాటి బిజెపిని దెబ్బకొడతామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని కొనియాడారు. అభివృద్ధి చేసుకోవడం ద్వారా సీఎం కేసీఆర్ కన్న కలలను సాకారం చేద్దామని అన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఎన్నో గ్రామాలు ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో అనుబంధంగా ఉండేవన్నారు. మెజార్టీ ఉన్న గ్రామాలే అభివృద్ధి చేసుకొనే వారని, మిగతా చిన్న గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చిన్న గ్రామ పంచాయతీ లతోనే అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పంచాయతీలను ఏర్పాటు చేశారన్నారు. దీంతో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వారి కల నెరవేరిందన్నారు. తండాలను పంచాయితీలుగా చేయడంతో స్వయం పాలన మొదలయ్యిందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చాయ న్నారు. కెసిఆర్ వచ్చాకే ఆసరా పింఛన్లు పెరిగాయని, అదేవిధంగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతులకు రైతుబంధు పథకం, రైతుభీమా పథకాలను ప్రవేశపెట్టిందని అందరూ వీటిని ఉపయోగించు కోవాలన్నారు.

# సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త వాతావరణం

## చైనా బోర్డర్‌లో ఇండియా భారీ సైనిక విన్యాసాలు



న్యూఢిల్లీ,జనవరి21(సమసమాజం): ఇండియా–చైనా సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ చైనా పీపుల్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) సైనికులతో మాట్లాడారు. లడఖ్ వద్ద వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ఏసీ) వద్ద సైనికులతో యుద్ధ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. దీంతో చైనా మరేదైనా కుట్ర చేస్తుందా అనే అనుమానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ అలర్ట్ అయింది. చైనాతో కొనసాగుతున్న ప్రతిష్టంభన మధ్య భారత్ భారీగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోంది. ఇటీవల కాలంలో తూర్పు సెక్టార్ లో చేపట్టిన రెండో అతిపెద్ద సైనిక విన్యాసాలు ఇవే. గతేడాది డిసెంబర్ నెలలో ఇలాగే సైనిక విన్యాసాలు చేశారు. డోక్లామ్ వద్ద చైనా తన కార్యకలాపాలు పెంచుతోందనే ఇంటెలిజెన్స్ నిఘా మేరకు భారత్ కూడా యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకుంటోంది.

# కెసిఆర్ క్షమాపణలు చెప్పాల్సిందే

## అప్పుడే ఎపిలోకి అడుగు పెట్టాలి

## మరోమారు డిమాండ్ చేసిన జివిఎల్



గుంటూరు,జనవరి21(సమసమాజం): ఏపీ ప్రజలకు తెలంగాణ సిఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బిజెపి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మరోమారు డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పిన తరవాతనే ఏపీలో రాజకీయాలు చేయాలని ఎంపీ అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మాట్లాడిన కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా రైల్వే స్టేషన్‌లో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన బెంచీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 రైల్వేస్టేషన్‌లలో రూ.50 లక్షల ఎంపీ లాడ్స్‌తో ప్రయాణీకుల కోసం కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. రైల్వే రంగంలో మోదీ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. రూ.20 కోట్లతో గుంటూరు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైల్వే వంతెనలు పూర్తి కావటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదని, భూ సేకరణ చేయడం లేదని అన్నారు. కడప – బెంగళూరు రైల్వే లైన్ కన్నా సీఎం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బస్సు ఛార్జీలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణీకుల నడ్డి విరుస్తోందని... దీంతో రైల్వేపై అదనపు భారం పడుతోందని జీవీఎల్ వెల్లడించారు.

# కరీంనగర్ లో ఆర్టీసీ బస్సు డ్రైవర్ల సమ్మె సైరన్

హైదరాబాద్,జనవరి21(సమసమాజం): కరీంనగర్ లో ఆర్టీసీ బస్టాండ్‌లో సమ్మె సైరన్ మోగింది. బస్సు డ్రైవర్ల సమ్మె కారణంగా ఇవాళ తెల్లవారుజాము నుంచే ఇతర ప్రాంతాలతో పాటు గ్రామాలకు వెళ్లే అద్దె బస్సులు నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి కరీంనగర్ కు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు కూడా సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు. నామమాత్రపు వేతనాలతో పాటు వేధింపులు కూడా తీవ్రంగా మారాయని బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారుల వివక్ష, వేధింపులను ఆపాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. నేడు ఉదయం కరీంనగర్ ఆర్టీసీ డిపో ఎదుట బస్సు డ్రైవర్లు తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేయడంతో బస్ స్టేషన్ పరిసరాలు దద్దరిల్లాయి. బస్సు డ్రైవర్ల నిరసనకు సిఐటియు కూడా మద్దతు తెలపడంతో ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. దాదాపు నెల రోజుల క్రితం ఇదే తరహాలో సమ్మె చేయడంతో అధికారులు అద్దె బస్సుల యాజమాన్యంతో చర్చలు జరిపి ఆందోళనలు విరమించారు. ఇవాళ మళ్లీ అదే డిమాండ్లతో అద్దె బస్సుల డ్రైవర్లు నిరసనకు దిగారు. సమ్మె కారణంగా అద్దె బస్సులు, ప్రైవేట్ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఆర్టీసీ డిపోలపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు.

# అన్నదాతకు మేలు చేసే పథకం

## కెసిఆర్ నిర్ణయాలతో రైతుల ఆనందం



నిజామాబాద్,జనవరి21(సమసమాజం): సాగుకు ఉపక్రమించే సమయంలో అవసరమైన పెట్టుబడులతో పాటు ఎరువులు కొనుగోళ్లు చేసేందుకు అన్నదాతలు ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీకి అప్పులు తెస్తుంటారు. చాలా సందర్భాల్లో ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. సిఎం కెసిఆర్ నిర్ణయంతో ఇక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే దౌర్భాగ్యం పోతుందని రైతులు అంటున్నారు. ప్రతి వూరిలోనూ గ్రామ రైతు సంఘాలను ఏర్పాటు చేసుకుని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలుసుకునేలా వీటిని ఉపయోగించుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం వానాకాలంలో సాగుచేసే పంటలకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులు అవసరం. యూరియా, మిశ్రమ ఎరువుల కోసం ఎకరాకు రూ.5వేల వరకు వీరు వెచ్చిస్తుంటారు. సీఎం సూచనల మేరకు ప్రతి వూరిలోనూ గ్రామ రైతు సంఘం ఏర్పాటయితే మెరుగైన వ్యవసాయ విధానాలను పరస్పరం అందిపుచ్చుకోవడానికి వీలవుతుందన్నారు.

# రెండు రోజులపాటు గోల్కొండ కోట సందర్శన రద్దు

హైదరాబాద్,జనవరి21(సమసమాజం): వస్తున్న జీ20 ప్రతినిధులు.. గోల్కొండ కోటను సందర్శించనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జీ20 సమావేశాల నేపథ్యంలో సమ్మిట్ వర్కింగ్ గ్రూప్ హైదరాబాద్‌లో పర్యటి స్తుంది. ఇందులో భాగంగా చారిత్రక కట్టడమైన గోల్కొండ కోటను కూడా సందర్శించనుంది ఈ టీమ్. అలాగే రాణి మహల్‌ను కూడా సందర్శించే అవకాశం ఉంది.కాగా, జీ20 లీడర్స్ సమ్మిట్ ఈ ఏడాది సెప్టెంబర్ 9, 10 వ తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు ముందు దేశంలోని 56 నగరాల్లో 215 కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో 6 సమావేశాలు జరుగనున్నాయి. తొలి సమావేశం జనవరి 28న జరుగనుండగా.. మార్చి 6,7, ఏప్రిల్ 26, 27, 28, జూన్ 7, 8, 9, జూలై 15, 16, 17 తేదీల్లో వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయి. జీ–20 సన్నాహక సమావేశాలకు ముందస్తు ప్రిపరేషన్‌లో భాగంగా ఇమ్మిగ్రేషన్, టూరిజం సిబ్బందికి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాపులో ఏఎస్ఐ అధికారులు, మాన్యుమెంట్ గైడ్‌లు, ఇన్‌క్రెడిబుల్ ఇండియా టూరిస్ట్ గైడ్, రాణి మహళ్, గోల్కొండ ఫోర్ట్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సెషన్‌లో పరిశుభ్రత, వ్యక్తిగత వస్త్రధారణ, మర్యాదలు, పర్యాటక అవగాహన, గైడెన్స్ ఇవ్వడంపై అవగాహన కల్పించారు.

# జనసేనకు మహిళలే పెద్ద అండ

కర్నూలు,జనవరి21(సమసమాజం):పొత్తులపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్దే తుది నిర్ణయమని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు నాగబాబు స్పష్టం చేశారు. శనివారం మౌర్య హోటల్లో జనసేన వీర మహిళల సమావేశంలో నాగబాబు పాల్గొని ప్రసంగించారు. పొత్తులు లేకుండా ఉంటే జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని తెలిపారు. పొత్తులు ఉంటే పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ముందుకు వెళతామని నాగబాబు పేర్కొన్నారు. మహిళలు అంతా జనసేన కార్యక్రమాల్లో పాల్గొని పార్టీని ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. జనసేనకు మహిళలు పెద్ద పెన్నిధి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తు అనేది త్వరలోనే చెబుతామని జనసేన పీఏసీ సభ్యులు నాగబాబు తెలిపారు. ఏపీలో పాలన చెత్తగా ఉందని.. నాలుగేళ్లుగా అరాచకం, రౌడీ రాజ్యం, గంజాయి రాష్ట్రంగా మారిపోయిందన్నారు. శ్రీకాకుళంలో జరిగిన యువశక్తి ప్రోగ్రాంతో రాష్ట్రంలో జనసేన నాయకులపై వైసీపీ కన్నేసి ఉంచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఎలా ముందుకెళ్లాలి అనే దానిపై జనసైనికులతో చర్చిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్‌పై పోటీకి సిద్ధం అన్న అలీ కామెంట్స్‌పై.. నో కామెంట్స్ అని నాగబాబు చెప్పారు.



పొత్తులపై పవన్ కళ్యాణ్‌దే తుది నిర్ణయం: నాగబాబు

# కాలిపోయిన భవనంలో అస్థిపంజరం లభ్యం



(మొదటి పేజీ తరువాయి).. భవనం మొదటి అంతస్తు వెనక భాగంలో శిథిలాను తొలగిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి అస్థిపంజరాన్ని గుర్తించిన అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఐతే ఆ డెడ్ బాడీ ఎవరిదన్న వివరాలు తెలియాల్సి ఉంది. మృతేదేహాన్ని స్వాధీనం చేసకున్నాక.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తారు. పరీక్షల నివేదిక వచ్చిన తర్వాతే.. ఆ మృతదేహం ఎవరిదన్న దానిపై క్లారిటీ వస్తుంది.దక్కన్ మాల్ అగ్నిప్రమాదానికి గురైనప్పుడు అందులో ముగ్గురు సిబ్బంది చిక్కుకుపోయారని అధికారులు చెప్పారు. వారిని గుజరాత్‌కు చెందిన వసీమ్, జునైద్, జాహిద్‌గా గుర్తించారు. మంటలు చెలరేగిన తర్వాత.. తమ వస్తువులను తెచ్చుకునేందుకు లోపలికి వెళ్లారని.. మళ్లీ తిరిగి రాలేదని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. వారి సెల్ ఫోన్ లోకేషన్ కూడా కాలిపోయిన భవనంలోనే చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు వ్యక్తులు భవనంలోనే చనిపోయి ఉంటారని నిర్ధారణకు వచ్చారు. దీనిపై ఇప్పటికే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఐతే వారి మృతదేహాలు లేదా అవశేషాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. లోపలికి వెళ్లే అవకాశం లేకపోవడంతో.. డ్రోన్‌ను పంపించి.. లోపలి దృశ్యాలను కమెరాల సాయంతో పరిశీలిస్తున్నారు. భవనం నుంచి ఇంకా వేడి వస్తుంది. ఫోమ్‌ని.. నీటిని చల్లుతున్నారు. పూర్తిగా లోపలికి వెళ్లకుండా.. కొంత పరిధి మేరకే లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉండడంతో.. అక్కడి వరకు వెళ్లి.. పరిశీలిస్తున్నారు అధికారులు. మరోవైపు అగ్నిప్రమాదానికి గురైన దక్కన్ మాల్‌ని కూల్చాలని అధికారులు నిర్ణయించారు. మరో కమిటీ నివేదిక వచ్చాక.. కూల్చివేత పనులు ప్రారంభించనున్నారు. ప్రమాదానికి గురైన భవనం ఆరంతస్తులు ఉండడంతో.. అది కూలిపోతే.. పక్కనున్న భవనాలు కూడా దెబ్బతినే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాలకు ఎవరినీ అనుమతించడం లేదు. ఆ ఇళ్లల్లోని ప్రజలను కూడా ఖాళీ చేయించారు. పక్క భవనాలను ఇబ్బంది కలగకుండా.. ఉన్నచోటే కూల్చాలని అధికారులు భావిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కూల్చివేత పనులు పూర్తయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన ఖరారు



(మొదటి పేజీ తరువాయి).. ఈ నెల 15న సికింద్రాబాద్- వైజాగ్ వందేభారత్ ట్రయిన్‌ను మోడీ వర్చువల్ గా ప్రారంభించారు. దీంతో ఇపుడు మోడీ టూర్ ఖరారయ్యింది. అప్పుడు వాయిదా పడ్డ మోడీ టూర్‌ను వచ్చే నెలకు రీ షెడ్యూల్ చేశారు. తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గర పడటం, ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశముందనే ప్రచారం నేపథ్యంలో మోదీ తెలంగాణ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టడం, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న క్రమంలో.. జాతీయ నేతలు రాష్ట్రానికి వస్తున్నారు. ఈ నెలలో అమిత్ షా రానుడంగా.. వచ్చే నెలలో మోదీ వస్తున్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో మోదీ ఏం మాట్లాడతారనేది హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం కేసీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేస్తారా..? కేంద్ర ప్రభుత్వంపై కేసీఆర్ చేసే ఆరోపణలకు సమాధానం చెబుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో పలుమార్లు తెలంగాణ పర్యటనకు వచ్చిన సమయంలో సీఎం కేసీఆర్‌పై మోదీ విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటూ కార్యకర్తలకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. తెలంగాణలోని బీజేపీ కార్యకర్తలు బాగా పనిచేస్తున్నారంటూ మోదీ అనేకసార్లు ప్రశంసించారు. ఇలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను కూడా మోదీ పొగిడారు. గతంలో బీజేపీ జాతీయ కార్యకవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో జరిగిన సమయంలో పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో మోదీ పాల్గొని ప్రసంగించగా.. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి గురించే మాట్లాడారు. కేసీఆర్‌పై అప్పట్లో ఎలాంటి విమర్శలు మోదీ చేయలేదు. తాజాగా మోదీ పర్యటన ఖరారు కావడంతో ఇక బిజెపి నేతలు సభను విజయవంతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. ఖమ్మంలో బిఆర్ఎస్ సభను మించి నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు బహిరంగ సభకు రాష్ట్ర బీజేపీ నేతలు ఏర్పాట్లు చేయనున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ బహిరంగ సభలో భారీగా పాల్గొననున్నారు.

# కామారెడ్డి జిల్లాలో దొంగల హల్‌చల్

ఆలయాల్లో వరుస చోరీలు



కామారెడ్డి,జనవరి21(సమసమాజం): కామారెడ్డి జిల్లాలో దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేరోజు నాలుగు ఆలయాలు, ఓ దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. కామారెడ్డి పట్టణంలోని వీక్లీమార్కెట్‌లో ఉన్న రాజరాజేశ్వరాలయం, ముత్యాల పోచమ్మ, మత్తడి పోచమ్మ ఆలయాలు, ఓ షాపులో గుర్తుతెలియని వక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. రామారెడ్డి మండలంలోని పోసానిపేట్‌లో ఉన్న ఎల్లమ్మ ఆలయంలోనూ చోరీచేశారు. ఆలయాల తలుపులు ధ్వంసం చేసి హుండీలు ఎత్తుకెళ్లారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

# బడ్జెట్‌పై కసరత్తు



(మొదటి పేజీ తరువాయి).. సంవత్సరం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్ద పీట వేయనున్నారు. ఇందుకోసం సుమారు రూ.37,000 కోట్లు కేటాయించనున్నట్లు సమాచారం.ఆ కేటాయించిన నిధుల్లో రూ.16 వేల కోట్లు కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3 లేదా 5వ తేదీ నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్ రూ.2.85 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నట్టు సమాచారం. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓ కొలిక్కివచ్చిన ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా, నిధులు కేటాయించడంతోపాటు కాళేశ్వరం సహా వివిధ ప్రాజెక్టులకు తీసుకున్న రుణాలకు అసలు, వడ్డీ తిరిగి చెల్లించేందుకు అవసరమైన నిధులనూ బడ్జెట్‌లో కేటాయించనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి రాష్ట్ర బడ్జెట్‌ను మార్చి మొదటివారంలో ప్రవేశపెడుతుంటారు. అయితే సీఎం కేసీఆర్ కొన్ని నెలలుగా జాతీయ రాజకీయాలపై సీరియస్‌గా దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బడ్జెట్‌ను ముందే ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం.

# కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి



(మొదటి పేజీ తరువాయి).. చేయాలని కొండా సురేఖ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి.ఇదిలా ఉంటే నిన్న కాంగ్రెస్ కొత్త ఇంఛార్జి మాణిక్ రావు ఠాక్రే తెలంగాణకు వచ్చారు. ఈ క్రమంలో గాంధీభవన్ లో పలువురు కాంగ్రెస్ నాయకులతో సమావేశం అయ్యారు. చాలా రోజుల తరువాత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా గాంధీభవన్ కు వచ్చారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీతో కోమటిరెడ్డి, రేవంత్ మధ్య సయోధ్య కుదిరింది. వెంకట్ రెడ్డి మనసు మార్చుకున్నారని ఆయన వ్యాఖ్యలను బట్టి అర్థం అయింది. ఈ సమయంలో కొండా సురేఖ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే తెలంగాణ కాంగ్రెస్ లో కొత్త కమిటీలు కల్లోలం రేపాయి. ఇటీవల లీజ్ చేసిన లిస్ట్ లో తన జూనియర్ల కంటే తనకు తక్కువ స్థానం కల్పించారని కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి కొండా సురేఖ రాజీనామా చేశారు. ఇది తనను అవమానించడమే అని పదవులు ముఖ్యం కాదు ఆత్మభిమానం ముఖ్యం అని కొండా సురేఖ తెలిపారు. తాను కాంగ్రెస్ కార్యకర్తగానే కొనసాగుతానని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కి కు బహిరంగ లేఖ రాశారు. కొత్త కమిటీలో వరంగల్ నేతల పేర్లు లేకపోవడం బాధ కలిగించిందని కొండా సురేఖ అన్నారు. కాగా ఇటీవల టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొండా సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి లాంటి నాయకుడు కావాలి. పీసీసీ పీఠంపై ఎవరున్నారనేది చూడాలి కానీ అతను ఏ పార్టీ నుంచి వచ్చారనేది చూడాల్సిన అవసరం లేదన్నారు. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి టీపీసీసీ గా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి తీరని అన్యాయం జరిగింది. ఆయన హయాంలోనే కాంగ్రెస్ దిగజారుతూ వచ్చిందన్నారు. ఇప్పుడు కోమటిరెడ్డిపై వ్యాఖ్యలు దుమారం రేపే అవకాశాలు ఉన్నాయి.

# ఎస్ఎస్‌సీలో రిక్రూట్‌మెంట్



(మొదటి పేజీ తరువాయి).. చేసింది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 17తో ముగియనుంది. ఇదిలా ఉండగా.. వివిధ కేంద్ర మంత్రిత్వశాఖల్లోని గ్రూప్- బి, గ్రూప్-సి ఉద్యోగాల కోసం నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్ సీ) పరీక్ష మరో 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనిని మల్టీ-టాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ ఎగ్జామ్ (ఎమ్టీఎస్)- 2022 పరీక్షలో అమలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు ఈ పరీక్ష కేవలం హిందీ, ఆంగ్లంలో నిర్వహిస్తున్నారు. దీంతో దక్షిణ భారతదేశంలోని నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వీటిపై ప్రభుత్వానికి తమిళనాడు , కర్ణాటక నుంచి కూడా కొన్ని రోజుల క్రితం విజ్ఞప్తులు చేశారు. ఇప్పటికే ఐబీపీఎస్ రూరల్ రీజియన్ బ్యాంక్ ఉద్యోగాలకు ప్రాంతీయ భాషలో పరీక్షలను నిర్వహిస్తోంది. తాజాగా నిరుద్యోగుల నుంచి వచ్చిన డిమాండ్ తో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. "భాష కారణంగా ఎవరూ అవకాశాలు కోల్పోవ ద్దన్న ప్రధాని మోదీ ఆకాంక్ష మేరకు హిందీ, ఆంగ్లంతో పాటు ఉర్దూ, తమిళ్, మలయాళం, తెలుగు, కన్నడ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కొంకణి, మణిపురి, మరాఠీ, ఒడియా, పంజాబీ భాషల్లోనూ ఎస్ఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నాం. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో ఉన్న మిగతా భాషలనూ పరీక్షలో క్రమంగా చేర్చుతాం" అని ఆయన అన్నారు. అంటే ఇక నుంచి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహించే పరీక్షలను తెలుగులో కూడా నిర్వహించనున్నారు. ఈ నోటిఫికేషన్ కు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మల్టీ-టాస్కింగ్ (నాన్-టెక్నికల్) స్టాఫ్- 10,880, హవల్దార్ -529 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీ, ఇంగ్లీష్ తో పాటు.. మరో 13 ప్రాంతీయ భాషలో కూడా ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి కటాఫ్ తేదీ ఫిబ్రవరి 17, 2023 కంటే ముందుగా పదికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. (రెవెన్యూ శాఖ)లో , హవల్దార్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు జనవరి 1 2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. (రెవెన్యూ శాఖ)లో హవల్దార్, కొన్ని పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే అభ్యర్థి వయసు జనవరి 1, 2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అంటే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.అన్ రిజ్వర్డ్, బీసీ అభ్యర్థులు రూ.100 ఫీజు చెల్లించాలి. ఇక ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఇచ్చారు. వీరు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

# డీఎస్సీ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు మౌన దీక్ష

(మొదటి పేజీ తరువాయి).. దంపతులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఈ క్రమంలో వారి వెంట చిన్నారులు విలపించారు. మరో పక్క కొంత మంది పోలీసులు చిన్నారులను చేరదీసుకొని.. వారి తల్లిదండ్రులను ఈడ్చుకుంటూ వాహనాల్లో తరలించారు. దాదాపు గంట పాటు అరెస్టుల పరంపర కొనసాగడంతో.. కొందరు ఉపాధ్యాయులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. 19 జిల్లాల్లో బదిలీలకు అనుమతించిన ప్రభుత్వం మరో 13 జిల్లాల్లో ఆపేయడం అన్యాయమా? అని ఉపాధ్యాయ దంపతులు ప్రశ్నించారు. వేర్వేరు ప్రాంతాల్లో విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 317 ద్వారా ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ తక్షణమే జోక్యం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.సంవత్సరకాలంగా 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీల కోసం ఎదురు చూస్తున్న స్పౌజ్ ఉపాధ్యాయులు ఇవాళ డీఎస్సీ కార్యాలయం ముందు మౌన దీక్షకు దిగారు. వందలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు.. మౌనంగా తమ ఆవేదనను ప్రభుత్వానికి వివరించే ప్రయత్నం చేశారు. గడిచిన సంవత్సరంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రతిస్పౌస్ బాధితుడికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దంపతుల బదిలీలను బ్లాక్ చేసిన 13 జిల్లాల్లో 2100 మంది బాధితులు ఉండగా, అందులో 615 మందికి మాత్రమే స్పౌజ్ బదిలీలు జరుగుతున్నాయని, అది కూడా కేవలం కొద్ది మంది స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే అనుమతించి. ఎస్జిటి, పండిట్, పీఈటి ఇతర ఉపాధ్యాయ దంపతుల బదిలీలు జరగడంలేదని విస్తృత ప్రచారం జరుగుతుంది. అసలు ఏం జరుగుతుందో అర్థం కాక ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుండి సరైన సమాధానం దొరకక ఆందోళనతో ఉపాధ్యాయ దంపతులు డీఎస్సీ కార్యాలయం ముందు మౌన దీక్ష చేపట్టారు. హైదరాబాద్ లక్డికపుల్ లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు మౌన దీక్షకు ఉపాధ్యాయ స్పౌస్ ఫోరమ్ పిలుపు నిచ్చింది. ఈనేపథ్యంలో.. హైదరాబాద్ లకుడికపూల్ లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు 13 జిల్లాల్లో బదిలీల కోసం ఆందోళన చేపట్టారు. దీంతో టీచర్లు వారిపిల్లలు మౌన దీక్ష ఉద్రిక్తంగా మారింది. కమిషనర్ కార్యాలయం చేరుకుంటున్న ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ ఉపాధ్యాయ దంపతులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు. ఈ ఆందోళనలో చిన్నారులపై సైతం పోలీసులు దారుణంగా అరెస్ట్ చేయడంతో.. తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ లో ఉంచిన 13 జిల్లాల్లో 1656 మందికి దంపతుల బదిలీలు నిర్వహించేందుకు ఫైలు సిద్ధమైందని సమాచారం ఉన్నప్పటికీ, 615 మందికి మాత్రమే చేయాలనుకోవడం బాధాకరమని ఉపాధ్యాయులు ఆవేదన చెందారు. 30% మందికే దంపతుల బదిలీలు చేపట్టి, పూర్తిగా అవకాశం ఉన్న క్యాడర్లను పక్కకు పెట్టడం స్పౌజ్ బదిలీల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలలో ఆవేదన మిగిలిందని ఉపాధ్యాయులు వాపోయారు. సంగారెడ్డి జిల్లాలో ఎస్జీటీ కేడర్ లో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే కౌజు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ జిల్లాలో 362 ఎస్ జి టి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాదు సూర్యాపేటలో 28 మంది ఎస్జీటీలలో బదిలీ కోసం అప్లై చేసుకోగా 252 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో కూడా 40 మంది ఎస్జీటీలు దంపతులు బదిలీల కోసం అర్జీ పెట్టుకోగా 341 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించనున్న ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా కూడా వందల సంఖ్యలో ఖాళీలు ఏర్పడనున్నాయి. ఒకటి రెండు క్యాడర్ల మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ స్పౌజ్ అప్పీళ్ళు అన్నిటినీ క్లియర్ చేసే అవకాశం ఉందని, ఉపాధ్యాయుల ఆవేదన చెందారు. సంవత్సరం క్రితం 19 జిల్లాలకు ఇచ్చి,13 జిల్లాలను బ్లాక్లో ఉంచి వివక్షకులు చూపారని, ప్రమోషన్లు బదిలీల సందర్భంగా తమకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన ఉపాధ్యాయ దంపతులకు తీరని ఆవేదన మిగిల్చుతున్నారని వాపోయారు. దంపతులు గడిచిన సంవత్సరం గా 13 జిల్లాల్లోని ఉపాధ్యాయ దంపతులు బదిలీల కోసం విద్యాశాఖ మంత్రి తో పాటు మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న. పిల్లాపాపలతో కుటుంబాలుగా జిల్లా కేంద్రాల్లో, హైదరాబాద్ లో, శాంతియుత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిరంతరాయంగా ఎన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఉపాధ్యాయ దంపతులు బదిలీల ప్రక్రియ మాత్రం జరగడం లేదు. ప్రమోషన్లలో బదిలీ నిర్వహిస్తున్న ఈ తరుణంలో సీఎం కేసీఆర్ మాత్రమే తమ సమస్యకు పరిష్కారం చూపగలరని, మౌన దీక్ష ద్వారా ఉపాధ్యాయులు చేస్తున్న ఈ విన్నపాన్ని సహృదయంతో స్వీకరించి వెంటనే 13 జిల్లాల ఉపాధ్యాయ దంపతులు అందరికీ బదిలీలు జరిపించాలని వేడుకున్నారు.రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం ఉపాధ్యాయులను జిల్లాల కేటాయింపు ప్రక్రియ 2021 డిసెంబర్లో జరిగింది. ఈ కేటాయింపులో భాగంగా భార్యాభర్తలైన ఉపాధ్యాయులను వారు కోరుకున్న జిల్లాల కేటాయించాలని ప్రభుత్వం మేము 1655 ప్రకారం స్పష్టంగా ఉంది. మేము 1655 ప్రకారం 19 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతులకు జరిపిన ప్రభుత్వం, మిగిలిన 13 జిల్లాలను బ్లాక్ లిస్టులో పెట్టింది. వందల కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ, డ్యూటీలు చేస్తూ కష్టనష్టాలను పడుతున్న వారిలో 90 శాతం మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. ఎక్కువ మందికి పది సంవత్సరాలు లోపు వయసున్న పిల్లలు ఉన్నారు. 25 సంవత్సరాల పైబడిన సర్వీసు ఉంది. ఈ పరిస్థితి , బాధ్యతలు విద్యాబోధనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వం వారు పై విషయాలను పరిగణలు తీసుకుని వెంటనే 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతులకు బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు.


# కేసీఆర్ కళ్లకి అద్దాలు పెట్టించాలి

(మొదటి పేజీ తరువాయి).. కేసీఆర్ అంటూ ఆయన విమర్శలు గుప్పించారు. శాసనసభ, మండలికి కేసీఆర్ అర్థం లేకుండా చేశారన్నారు. శాసన మండలి ఛైర్మన్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి కానీ.. ఆయన రోజూ రాజకీయాలే మాట్లాడుతున్నారన్నారు. శాసన మండలి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి రాజకీయాలు మాట్లాడాలని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# వాషింగ్ మిషన్ పేలి ఇద్దరికి గాయాలు

కామారెడ్డి,జనవరి21(సమసమాజం): బట్టలు ఉతికే వాషింగ్ మిషన్ పేలి ఇద్దరు గాయపడిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీ సప్తగిరి వీధి నెంబర్ 4లోని ఓ ఇంట్లో వాషింగ్ మిషన్ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారీ శబ్దం రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురైయ్యారు. గాయపడ్డవారు బాలయ్య, బాలలక్ష్మిగా గుర్తించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

# రెండు నెలల పాటు హాథ్‌సే హాథ్ జోడో యాత్ర



(మొదటి పేజీ తరువాయి).. ఐక్యంగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేయండి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 50 నియోజకవర్గాలకు తగ్గకుండా యాత్ర చేస్తారు. మిగిలిన సీనియర్లు కూడా 20.. 30 నియోజకవర్గాల్లో యాత్ర చేయాలి. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ యాత్రను విజయవంతం చేయాలి. అంతా ఐక్యంగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం, అధికారంలోకి రావడం ఖాయం. సమస్యలు ఉంటే చెప్పండి. నాకు ఫోన్ చేయండి. ఎప్పుడూ అందుబాటులోనే ఉంటా. పార్టీకి నష్టం చేసేలా ఎవరూ మీడియా ముందు మాట్లాడొద్దు" అని ఠాక్రే పార్టీ నేతలకు సూచించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ముగ్గురు ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు. తెలంగాణలో ఫిబ్రవరి 6 నుంచి రెండు నెలల పాటు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రియాంక లేదా సోనియాగాంధీ ఒక రోజు యాత్రలో పాల్గొనేలా సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. ఈనెల 26న భద్రాచలం నుంచి లాంఛనంగా యాత్రను ప్రారంభించనున్నట్టు వివరించారు. ఠాక్రే సమావేశానికి 3 సార్లు రానివారి నుంచి వివరణ తీసుకుంటామని, కీలక సమావేశానికి హాజరుకాని వారిని పార్టీ నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డిపై అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. అక్రమ కేసులపై డీజీపీకి ఫిర్యాదు చేశామని వెల్లడించారు. నాగర్ కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# స్వదేశంలో భారత్‌ను ఓడించడమే కంగారూ జట్టు కల



ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వచ్చే నెలలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు 5 సంవత్సరాల తర్వాత భారత్‌ను సందర్శించనుంది. కంగారూ జట్టు భారత గడ్డపై నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుంది. ఫిబ్రవరి 9 నుంచి ఇరు దేశాల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ నాగ్‌పూర్‌లో జరగనుంది. భారత పర్యటనలో టెస్టు సిరీస్‌ను గెలవాలని ఆస్ట్రేలియా జట్టు చాలా కాలంగా తహతహలాడుతోంది. ఈసారి స్వదేశంలో భారత్‌ను ఓడించడమే కంగారూ జట్టు కలగా మారింది. చాలా మంది ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్లు కూడా చాలా కాలంగా భారత్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించాలని కోరుకుంటున్నారు. అయితే ఐదు దశాబ్దాలకుపైగా భారత్‌లో ఆస్ట్రేలియా ఒక్కసారి మాత్రమే టెస్టు సిరీస్‌ను గెలుచుకోగలిగింది. అంతేకాదు గత 14 ఏళ్లలో భారత్‌లో కంగారూ జట్టు ఓ టెస్టు మాత్రమే గెలిచింది. 1956-57లో ఆస్ట్రేలియా తొలిసారిగా భారత్‌లో టెస్టు సిరీస్ ఆడింది. ఇందులో అతను 2-0తో భారత్‌ను ఓడించాడు. ఆరంభం నుంచి 13 ఏళ్ల పాటు భారత గడ్డపై ఆస్ట్రేలియా ఆధిపత్యం చెలాయించింది. ఈ సమయంలో, కంగారూలు భారతదేశంలో జరిగిన నాలుగింటిలో మూడు టెస్ట్ సిరీస్‌లను గెలుచుకున్నారు. ఒకటి డ్రాగా ముగిసింది. 1970లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన తర్వాత భారత్ గుణపాఠం నేర్చుకుంది. ఆ తర్వాత టీమ్ ఇండియా కొన్ని ప్లాన్స్ వేసుకుంది. మరోసారి 1979-80లో భారత పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా జట్టు.. టెస్టు సిరీస్‌లో 2-0తో భారత్‌ను ఓడించింది. 1986-87లో సిరీస్ డ్రా అయింది. ఆ తర్వాత 1996 నుంచి 2001 వరకు భారత్ తన సొంతగడ్డపై ప్రతిసారి ఆస్ట్రేలియాను ఓడించింది. అదే సమయంలో 2004-05లో ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌ని కైవసం చేసుకుంది. అయితే ఆ తర్వాత, 2008-09, 2010-11, 2012-13, 2016-17 టెస్ట్ సిరీస్‌లలో భారత్ వరుసగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాను వారి స్వదేశంలో ఓడించింది. ఈ విధంగా గత 52 ఏళ్లలో చూస్తే.. భారత్‌లో ఒక్కసారి మాత్రమే టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కంగారూ జట్టు విజయం సాధించింది. ఆస్ట్రేలియా గత నాలుగు భారత పర్యటనలను పరిశీలిస్తే, ప్రదర్శన చాలా ఇబ్బందికరంగా మారింది. గత 14 ఏళ్లలో భారత పర్యటనలో ఆస్ట్రేలియా 14 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో కంగారూ జట్టు ఒక్క మ్యాచ్‌లో మాత్రమే గెలవగలిగింది. 2016-17లో ఇండియా టూర్‌లో పుణె టెస్టులో విజయం సాధించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా 333 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. 2008-9 నుంచి 2016-17 వరకు ఆస్ట్రేలియా జట్టు భారత గడ్డపై వరుసగా నాలుగు టెస్టు సిరీస్‌లను కోల్పోయింది. భారత పర్యటనలో ఈసారి కూడా కంగారూ జట్టు బాట అంత సులువు కాదని టీమ్ ఇండియా పటిష్ట రికార్డు తెలియజేస్తోంది. భారత బౌలర్లు, బ్యాట్స్‌మెన్‌లు అతిథులకు గట్టి పరీక్ష పెట్టేందుకు సిద్ధమయ్యారు.

# ఫ్రాంఛైజీలను కొనుగోలుకు బీసీసీఐ టెండర్లు

## ఫ్రాంఛైజీ రేసులో 30 కంపెనీలు





మహిళా క్రికెటర్లు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విమెన్స్ ఐపీఎల్‌కు అంతా సిద్ధమవుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఫ్రాంఛైజీలను కొనుగోలు చేసేందుకు బీసీసీఐ టెండర్లు ఆహ్వానించగా మొత్తం 30 సంస్థలు టెండర్ దరఖాస్తులు కొనుగోలు చేశాయి. మహిళల ఐపీఎల్ మొదటి సీజన్లో ఐదు జట్లు పోటీ పడనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మెన్స్ ఐపీఎల్ జట్లను కొనుగోలు చేసిన 10 కంపెనీలతో పాటు ఇంగ్లీష్ ఫుట్‌బాల్ లీగ్‌కు చెందిన మాంచెస్టర్ యునైటెడ్, భారత స్నాక్ బ్రాండ్ హల్దీరామ్స్ కూడా పోటీలో ఉండటం గమనార్హం. ఫ్రాంఛైజీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు నేటితో (జనవరి 21) ముగియనుండగా.. హల్దీరామ్స్ ఇటీవలే టెండర్ దాఖలు చేసింది. మహిళ ఐపీఎల్ ఫ్రాంఛైజీల కోసం పది భారత నగరాలు, వేదికలతో బీసీసీఐ టెండర్లను ఆహ్వానించింది. సంస్థలు సింగిల్‌గా.. ఒకటి కంటే ఎక్కువ నగరాలకు బిడ్ దాఖలు చేసేలా నిబంధనలు విధించింది. ఇందుకోసం ఎలాంటి ప్రాథమిక ధరను నిర్ణయించలేదు. ఈ బిడ్లు పదేళ్ల కాలానికి అమల్లో ఉంటాయని పేర్కొంది. పురుషుల ఐపీఎల్‌లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన పది ఫ్రాంఛైజీలు మహిళల లీగ్‌కు సంబంధించిన టెండర్ డాక్యుమెంట్లు కొనుగోలు చేశాయి. అదానీ (గల్ఫ్ జెయింట్స్), కాప్రి గ్లోబల్ (షార్జా వారియర్స్) కూడా టెండర్ వేయనున్నాయి. సిమెంట్ కంపెనీలు చెట్టినాడ్ సిమెంట్, జేకే సిమెంట్‌లూ ఫ్రాంఛైజీ కొనుగోలు పట్ల ఆసక్తితో ఉన్నాయి. ఇక ఇప్పటివరకు స్పోర్ట్స్ లీగ్‌ల్లో ఆసక్తి కనబర్చని శ్రీరామ్ గ్రూప్, నీలగిరి గ్రూప్, ఏడబ్ల్యూ కట్కూరి గ్రూప్ కూడా రేసులో ఉన్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ సంయుక్త యజమానులైన తెలుగు సంస్థ జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ వేర్వేరుగా టెండర్ డాక్యుమెంట్లు తీసుకోవడం గమనార్హం. ఏపీఎల్ అపోలో, హల్దీరామ్ జట్టును కొనుగోలు చేసేందుకు ఉత్సాహంతో ఉన్నాయి.సీల్డ్ బిడ్లను జనవరి 25న ఓపెన్ చేసి బీసీసీఐ ఫ్రాంఛైజీ విన్నర్లను ప్రకటించనుంది.

# ఒలింపిక్స్‌లో క్రికెట్ కు నో బెర్త్

## క్రికెట్‌ను చేర్చాలేమంటూ తేల్చిచెప్పిన కమిటీ





ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చూడటమనేది క్రికెట్ అభిమానుల చిరకాల కోరిక. ఇందుకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు మరోసారి నిరాశే మిగిలింది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చాలేమంటూ ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ తేల్చి చెప్పింది. అంతర్జాతీయ క్రికెట్ మండలికి ఈ విషయాన్ని తెలియజేసింది. దీంతో విశ్వక్రీడల్లో క్రికెట్‌ను వీక్షించాలంటే అభిమానులు మరో కొన్నేళ్లుపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఒలింపిక్స్ తర్వాత 2032లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరం విశ్వక్రీడలకు వేదిక కానుంది. కనీసం ఈసారైనా క్రికెట్ చేర్చుతారేమో చూడాలి. ఇక, ఇప్పటి వరకు ఒలింపిక్ చరిత్రలో క్రికెట్‌ను ఒక్కసారి మాత్రమే చేర్చారు. పారిస్‌లో జరిగిన1900 విశ్వక్రీడల్లో క్రికెట్ భాగమైంది. కానీ ఆ తర్వాత మళ్లీ ఈ మెగాటోర్నీలో క్రికెట్‌కు అవకాశం రాలేదు. ఆ ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్, ఆతిథ్య ఫ్రాన్స్ మాత్రమే రెండు జట్లుగా బరిలో దిగాయి. ఒలింపిక్స్‌లో ఏయే క్రీడలను చేర్చాలనే విషయమై గతేడాది ఫిబ్రవరిలో సమావేశం జరిగింది. ఆ మీటింగ్‌లో 28 క్రీడల్ని ఎంపిక చేశారు. కానీ ఆ తర్వాత మరో 8 క్రీడలు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. ఇవి లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో భాగం కానున్నాయి. భవిష్యత్తులోనూ ఇతర క్రీడలను చేర్చవచ్చు, అందులో క్రికెట్ కూడా ఒకటి కూడా ఉంటుందనే ఆశలూ ఉన్నాయి. నిరుడు బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో దాదాపు 24 ఏళ్ల తర్వాత మహిళల క్రికెట్‌ను చేర్చారు. దీనికి ముందు 1998 కామన్వెల్త్ గేమ్స్‌లో క్రికెట్ ఆడేవారు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ క్రికెట్ పోటీలకు భారత్‌తో సహా ఎనిమిది జట్లు అర్హత సాధించాయి.ఖర్చు, భద్రత, ఆతిథ్య దేశాల ఆసక్తిని పరిగణలోకి తీసుకుని ఒలింపిక్స్‌లో క్రీడలకు అవకశం కల్పిస్తారు.

# సూర్యకుమార్ పొట్టి ఫార్మాట్‌లో అదరగొట్టేశాడు

## టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్



సూర్యకుమార్ యాదవ్.. టీ20ల్లో భారీ ఇన్నింగ్స్‌లను ఆడటంలో దిట్ట. దాదాపు ఒకే ఏడాదిలో మూడు సెంచరీలు బాది సంచలనం సృష్టించాడు. పొట్టి ఫార్మాట్‌లో నంబర్‌వన్ ర్యాంకర్. అలాంటి సూర్యకుమార్‌కు వన్డేల్లో మాత్రం పెద్దగా అవకాశాలు రావడం లేదు. కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్.. ఇలా ఎవరైనా గాయపడితేనే జట్టులోకి తీసుకోవడం జరుగుతోంది. అలాగే ఐదారు స్థానాల్లో బ్యాటింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ క్రమంలో సూర్యకుమార్‌కు రెగ్యులర్‌గా జట్టులో స్థానం కల్పించకపోవడంపై టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. టీ20ల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా ఎంపికైన ఆటగాడికి వన్డేల్లో స్థానం లేకపోవడం విచిత్రంగా ఉందన్నాడు. " కొంతకాలమైన ఒకే జట్టును ఎంపిక చేసి మ్యాచ్‌లను ఆడించాలి. అందులో ఎవరైనా సరిగా ఆడకపోతే అప్పుడు మార్పు చేశారంటే అర్థం చేసుకోవచ్చు. అయితే ఒక మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన ఆటగాడిని తదుపరి మ్యాచ్‌కు పక్కన పెట్టడం.. జట్టులోకి వేరొకరు రావడం ఏంటో క్రికెటర్లుగా మాకు అర్థం కావడం లేదు. సూర్యకుమార్ పొట్టి ఫార్మాట్‌లో అదరగొట్టేశాడు. అయినా సరే అతడికి వన్డేల్లో చోటు కష్టంగా మారడం చూస్తున్నాం" "అందుకే ఇలాంటి సమస్యకు పరిష్కారంగా మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను తయారు చేసుకొంటే బాగుంటుంది. ఇదంతా క్రికెట్ బోర్డు చూసుకొంటుంది. సెలెక్టర్లు తమ ప్రణాళికపై స్పష్టంగా ఉండాలి. అయితే ఇలా చేయడం వల్ల చాలా మంది క్రికెటర్లకు అవకాశాలు ఇచ్చినట్లు అవుతుంది. బయట నుంచి చూసే నాకు కూడా మనకు మూడు జట్లు ఉన్నాయి అనిపిస్తుంది. దాంతో మరింతమంది నాణ్యమైన ఆటగాళ్లను సిద్ధం చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది" అని కపిల్ దేవ్ వెల్లడించాడు.




# తగ్గేదేలే ..అంటున్న తమన్నా

## చిరుతో పాటు తైలవాతోనూ హీరోయిన్‌గా ఎంపిక



తమన్నా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి పద్దెనిమిదేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ కొత్త హీరోయిన్స్‌కు పోటీ ఇస్తూ దూసుకెళుతోంది. ప్రస్తుతం తెలుగులో చిరంజీవికి జంటగా 'భోళా శంకర్'లో నటిస్తుంది. ఈ మూవీని మెహర్ రమేష్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఇటీవలే కొత్త షెడ్యూల్ మొదలైంది. 'సైరా నరసింహారెడ్డి' తర్వాత చిరంజీవికి జంటగా నటిస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే ఈ అమ్మడు రజనీకాంత్ సినిమాలో చాన్స్ అందుకుంది. 'డాక్టర్' ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవాకి జంటగా తమన్నాను ఫైనల్ చేసినట్టు సన్ పిక్చర్స్ సంస్థ అనౌన్స్ చేసింది. ఇప్పటికే షూటింగ్‌లో కూడా జాయిన్ అయింది. ఇక్కడ చిరంజీవి, అక్కడ రజినీకాంత్ సినిమాల్లో నటిస్తూ, స్టార్ హీరోల బెస్ట్ చాయిస్‌గా మారింది తమన్నా. ఇక బాలీవుడ్ మూవీ 'బోలే చుడియన్'లో నటిస్తున్న ఆమె, మరోవైపు మాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తోంది. దిలీప్‌కు జంటగా 'బాంద్రా' అనే సినిమాలో యాక్ట్ చేస్తోంది. ఇలా నాలుగు భాషల్లో నాలుగు సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ, ఓ బాలీవుడ్ యాక్టర్‌తో ఆమె డేటింగ్ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. కొద్ది నెలల క్రితం ఓ బిజినెస్ మ్యాన్‌తో మ్యారేజ్ అనే వార్తలు వస్తే.. 'ఎఫ్ 3'లోని తన మేల్ గెటప్ వీడియో పోస్ట్ చేసి కౌంటర్ ఇచ్చింది. మరి తమన్నా ఈసారి ఎలా రియాక్ట్ అవుతుందో!




2023

సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య ,నందమూరి బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమాలు వచ్చిన విషయం తెల్సిందే. మెగా వర్సెస్ నందమూరి అన్నట్లుగా సాగిన సంక్రాంతి పోరు వచ్చే ఏడాది మరింత రసవత్తరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెగా కాంపౌండ్ తో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం ప్రకారం మెగా హీరోలు ఇద్దరు వచ్చే ఏడాది సంక్రాంతి పై దృష్టి పెట్టారు అనే వార్తలు వస్తున్నాయి. ఆ ఇద్దరు హీరోలు రామ్ చరణ్ మరియు అల్లు అర్జున్. ఇద్దరు కూడా సంక్రాంతికే తమ సినిమాలు తీసుకు రావాలని పోటీ పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న ఆర్సీ15 సినిమా తో రామ్ చరణ్ ఈ ఏడాదిలో రావాలని భావించినా కూడా కొన్ని కారణాల వల్ల సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుంది. అందుకే సంక్రాంతి వరకు వెయిట్ చేయాల్సి రావచ్చు. పైగా దిల్ రాజుకు సంక్రాంతి సీజన్ కలిసి వస్తుంది. అందుకే రామ్ చరణ్.. శంకర్ మూవీ ని వచ్చే ఏడాది సంక్రాంతికే విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక సూపర్ హిట్ మూవీ పుష్ప సీక్వెల్ గా రూపొందుతున్న పుష్ప 2 ను ఇటీవలే ప్రారంభించారు. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న పుష్ప సినిమా యొక్క సీక్వెల్ ను కూడా వచ్చే ఏడాది సంక్రాంతికే విడుదల చేయాలని మైత్రి మూవీ మేకర్స్ వారు భావిస్తున్నారు. మైత్రి వారు మొన్న సంక్రాంతికి రెండు సినిమాలతో వచ్చారు. కనుక వచ్చే సంక్రాంతికి కచ్చితంగా పుష్ప 2 ను తీసుకు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కేవలం ఈ మెగా హీరోల సినిమాలు మాత్రమే కాకుండా మరి కొన్ని పెద్ద హీరోల సినిమాలు,ఇతర చిన్న సినిమాలు కూడా వచ్చే ఏడాది సంక్రాంతి పై కన్నేశాయి. ఇంకా ఏడాది సమయం ఉండగానే కర్చీఫ్ ను వేసుకునేందుకు హీరోలు పోటీ పడుతున్నారు. రెండు మూడు నెలల్లో అధికారికంగా కూడా ప్రకటనలు వచ్చినా ఆశ్చర్యం లేదు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in